నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ప్రజాశక్తి - కొత్తచెరువు

వేసవి సెలవుల అనంతరం జూన్ 12వ తేదీ(సోమవారం) శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు పున:ప్రారంభమవుతాయని ఇన్‌ఛార్జి డిఇఒ రంగస్వామి తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఒంటి పూట బడుల తరహాలో తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు ఉదయం 7:30 నుంచి 11:30 గంటల వరకూ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 11 :30 గంటల తర్వాత విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేయాలని తెలిపారు.

అటకెక్కిన మార్కెట్‌యార్డ్ అభివృద్ధి

జిల్లాలో అతి పెద్ద మార్కెట్ హిందూపురం వ్యవసాయ మార్కెట్. మార్కెట్ పాలక వర్గం గడువు ముగిసి ఏడాది దాటింది. అయితే ఇంత వరకు పాలక వర్గాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయలేక పోయింది. దీంతో మార్కెట్ అభివృద్ధి అటకెక్కింది. పాలకవర్గం లేక పోవడంతో అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. ఇక్కడ ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా ఉంది. మార్కెట్‌లో చెత్తను తొలగించడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి తాగునీరు, మరుగుదొడ్లు సైతం ఏర్పాటు చేయలేని స్థితిలో అధికారులు ఉన్నారు.

పన్నుల వసూళ్లలో అధికారుల అలసత్వం

రూ.2.25కోట్లకు గాను.. రూ.1.58కోట్లు వసూలు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా ఉంది. చాలా మంది అధికారులు తమ విధులను విస్మరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సొంత లాభం తప్ప మార్కెట్ కమిటీ అభివృద్ధిపై దష్టి సారించడం లేదని ఆయా వర్గాల నుంచే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా మార్కెట్ ఫీజుల వసూలు దారుణంగా పడిపోయాయి. గడిచిన ఐదు సంవత్సరాల్లో ఒక్క సంవత్సరం సైతం లాభాల్లో మార్కెట్లు పయనించలేదు. ఇక హిందూపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రూ.82.34 లక్షలు మాత్రమే వసూలు చేశారు. దీనికి ప్రధాన కారణం అధికారులు ఫీజువసూలులో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. తప్పనిసరిగా ఈ-నామ్ విధానం అమలు జరిగితే మార్కెట్‌కు ఆదాయం పెరగుతుంది. అయితే మార్కెట్‌కు వచ్చే ఆదాయంతో తమకు పనిలేదని, తమకు వచ్చే ఆదాయానికి గండి పడకూడదని భావించి కొంతమంది మార్కెట్ అధికారులు వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లతో కలిసి పోయి ఈ-నామ్‌కు ఎగనామం పెట్టి, మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఒక్క సంవత్సరం కూడా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేకపోయారు.

లక్ష్యం ఘనం.. వసూళ్లే దారుణం

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో గడచిన ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని ఒక సంవత్సరం కూడా చేరుకోలేదు. 2017-18 సంవత్సరంలో రూ.2.42 కోట్లకు గాను రూ.2.18కోట్లు, 2018-19లో రూ.2.56కోట్లకు గాను రూ.2.30కోట్లు, 2019-2020లో రూ.2.53 కోట్లకు గాను రూ.1.69కోట్లు, 2020-2021లో రూ.2.47 కోట్లకు గాను రూ.58.67లక్షలు, 2021-2022లో రూ.1.85 కోట్లకు గాను రూ.1.47కోట్లు, 2022-2023లో రూ.2.25 కోట్లకు గాను రూ.1.58కోట్లు వసూలు చేశారు. అదే విధంగా ఉమ్మడి జిల్లాలో అనంతపురం, గుత్తి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాప్తాడు, రాయదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ మార్కెట్ కమిటీలున్నాయి. వీటి ఆదాయ వనరులను ఆధారంగా చేసుకుని రాష్ట్ర ఉన్నతాధికారులు రూ.10.43 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారు. అయితే అనంతపురం జిల్లాలో టార్గెట్ కన్న అదనంగా వసూలు చేస్తే శ్రీ సత్య సాయి జిల్లాలో రూ. 5.24 కోట్లకు గాను రూ.4.14 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఇందులో అనంతపురం, రాప్తాడు, శింగనమల కమిటీలు వసూళ్ల పరంగా బాగానేఉన్నాయి. ఆ తరువాత తాడిపత్రి పర్వాలేదనిపించినా మిగిలిన కమిటీల పరిస్థితి దారుణంగా ఉంది. ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుంతకల్లు, గుత్తి మార్కెట్ కమిటీలు ఫీజు వసూళ్లలో అధ్వానంగా ఉన్నాయి. 50శాతం కూడా వసూలు చేయకపోవడం గమనార్హం. గుంతకల్లు మార్కెట్ కమిటీ 25శాతంతో అట్టడుగు స్థానంలో ఉంది.

ఆదాయం తక్కువ ఖర్చు ఎక్కువ

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో ఎండు మిర్చి, చింత పండు ప్రదానపంటలు. ఇక్కడి మార్కెట్‌కు ఆంధ్రతో పాటు కర్నాటక రాష్ట్రం నుంచి రైతులు వారు పండించిన పంటను తెచ్చి విక్రయిస్తున్నారు. దీని కోసం 117 మంది కమిషన్ ఏజెంట్లు, 110 మంది ట్రేడర్లు ఉన్నారు. దీంతో పాటు కోడికొండ చెక్‌పోస్టు, మేళాపురం వద్ద మార్కెట్ కమిటీకి అనుబందంగా రెండు చెక్‌పోస్టులు ఉన్నాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయం కన్నా ఖర్చు ఎక్కువగా ఉంది. గడచిన ఐదు సంవత్సరాల్లో ఒక్క సంవత్సరం కూడా ఖర్చుకు మించి ఆదాయం రాలేదు.

దృష్టి సారించని పాలకవర్గం..

మార్కెట్‌ల అభివృద్ధి పట్ల పాలకవర్గ సభ్యులు దృష్టి సారించడలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కమిటీ కాల పరమితి ముగిసి ఏడాది అయింది. పాలక వర్గ సభ్యులు పాలన సమయంలో మార్కెట్ అభివృద్ధికి ఏమాత్రం చొరవ చూపలేదన్న విమర్శలు వినపిస్తున్నాయి. ఆ పాలక వర్గ సభ్యులు కేవలం పదవులకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. ఆరు నెలల క్రితం మార్కెట్ యార్డులకు రిజ్వరేషన్లు ఖరారు అయ్యాయి. ఈక్రమంలోనే గతంలోనే రెండు కమిటీలకు కొత్త పాలక వర్గ సభ్యుల నియామకం పూర్తి అయింది. అయితే మిగిలిన కమిటీలకు కొత్త పాలక వర్గ సభ్యుల నియామకం ఏడాది గడుస్తున్న జరగలేదు. కమిటీలు ఎంపిక చేసిన కొత్త పాలక వర్గ సభ్యుల రాకతో నైనా అభివృద్ధి సాధ్యమవుతుందా. లేకపోతే పాత పాలక వర్గ సభ్యుల మాదిరిగానే ఉండిపోతారో వేచి చూడాల్సుంది.

మార్కెట్‌లో జరుగుతున్న వ్యాపారాలు (ఫైల్ ఫోటో)

మార్కెట్‌లో పేరుకు పోయిన చెత్త

బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

బాధిత యువతికి న్యాయం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలో రహమత్‌పురంలో నివాసం ఉంటున్న ఒక యువతిని, ఇదే పట్టణంలో ముక్కడిపేటలో నివాసం ఉంటున్న చాంద్ స్టీల్ నిర్వాహకుని కుమారుడు అఖీబ్ నమ్మించి మోసం చేశాడని అతడిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించానని చెప్పిన అఖీబ్ తనను మోసం చేశాడని ఆ యువతి మూడు రోజుల క్రితం ఆత్మహయత్యానికి పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు ప్రభుత్వ అసుపత్రి చికిత్స పొందుతున్న ఆ యువతిని ఆదివారం పరామర్శించారు. ఆ యువతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి తమకు న్యాయం జరగలేదని, కనీసం కేసు కూడా నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని యువతితో పాటు ఆమె తల్లి నాయకుల వద్ద వాపోయింది. తమకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయని, ఎవరు తమను ఏమి చేయరని బెదరిస్తున్నట్లు వారు కన్నీళ్ల పర్యంతం అయ్యారు. స్పందించిన నాయకులు వెంటనే టూటౌన్ స్టేషన్‌కు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి కంజాక్షన్‌ను కలిసి సమస్యను వివరించారు. వెంటనే అఖీబ్‌పై కేసు నమోదు చేసి అఖీబ్‌తో పాటు వారి తల్లిదండ్రులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. విచారణ జరిపి బాధిత యువతికి న్యాయం చేస్తామని డిఎస్‌పి హామీ ఇచ్చారు. అనంతరం ఇంతియాజ్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. మూడు సంవత్సరాలుగా యువతికి మాయ మాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించిన అఖీబ్ ఆ యువతితో సహజీవనం చేశాడన్నారు. వివాహం చేసుకోవాలని యువతి కోరడంతో పెళ్లికి నిరాకరించాడన్నారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగుందని, తమ స్థాయికి మీ కుటుంబం తగదని అఖీబ్ తల్లి చెప్పడంతో అఖీబ్ పెళ్లికి నిరాకరించాడన్నారు. వెంటనే పోలీసులు స్పందించి అఖీబ్‌తో పాటు అతని తల్లిదండ్రులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎంతో పాటు సిఐటియు, అంగన్‌వాడీయూనియన్, మహిళా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. యువతికి న్యాయం జరిగే వరకు డిఎస్‌పి కార్యాలయం ముందు ధర్నా చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జగదీష్, రాము, రామకృష్ణ, అంగన్ వాడీ యూనియన్ ప్రాజెక్టు లీడర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికుల సమ్యలు తెలుసుకుంటున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

అభివృద్ధిపై దృష్టి సారించండి

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి 'పల్లె' హితవు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ప్రతిపక్షాలను విమర్శించడం మాని నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధిని చూపించా లని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి సవాల్ విసిరారు. పల్లె ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం సమీపంలోని శిల్పారామం గుట్టపై పర్యటించి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు 1,174 మంది పేదలకు 2 సెంట్ల చొప్పున ఇంటి పట్టా మంజూరు చేశామని, అందులో 674 ఇళ్ల నిర్మాణాల కు రూ. 2.50 లక్షల చొప్పున మంజూరు చేయగా 428 ఇళ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. ఇదే కాలనీలో రూ. 11.5 కోట్ల వ్యయంతో విద్యుత్, మట్టి రోడ్లు, తదితర పను లు చేపట్టామన్నారు. వైసిపి నాలుగేళ్ల పాలనలో మూరెడు సిమెంట్ రోడ్డు వేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశ్యం ఉంటే కాలనీల్లో సీసీ రోడ్లు వేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. నియోజకవర్గంలో నువ్వు సొంతంగా సాధించిన ప్రగతి ఏంటో ప్రజ లు గమనిస్తూనే ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏమేమి తెచ్చావో ప్రజలకు వివరించాల న్నారు. ఇకనైనా చౌకబారు విమర్శలు మాని ప్రజలకు మంచి చేయాలని హెచ్చరించారు.

2024 మార్చి నాటికి లక్ష్యాలను పూర్తి చేస్తాం

గృహ నిర్మాణశాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లా లో 2024 మార్చి నాటికి ఇచ్చిన లక్ష్యాల మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది జులై నెలలో ఐదు లక్షల ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిచేసి సామూహిక గృహప్రవేశాలు చేయించాలన్న లక్ష్యంగా గహ నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులు ఆదేశించింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నవరత్నాలలో భాగంగా అందరికీఇళ్లు పథకం కింద గృహ నిర్మాణాలు చేపట్టింది. తరచూ వీడియో కాన్ఫరెన్స్‌ల్లో జిల్లా కలెక్టర్లతో గీహ నిర్మాణ పురోగతిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. ఎక్కడికక్కడ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీ సత్యసాయి జిల్లా గృహ నిర్మాణాలపై ఆ శాఖ పీడీ చంద్రమౌళి రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో ఆ జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని లేఅవుట్లలో ఎన్ని గృహాలు మంజూరయ్యాయి?

జవాబు: జిల్లాలో మొత్తం 62,533 గృహాలు మంజూరు అయ్యాయి. 251 లేఅవుట్లలో గృహ నిర్మాణాలు జరుగుతున్నాయి. వివిధ దశల్లో నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

ప్ర : గృహ నిర్మాణాలు ఎన్నెన్ని ఏయే దశల్లో జరుగుతున్నాయి?

జ: బిలో బేస్మెంట్ లెవెల్ కింద 23,233, బేస్మెంట్ లెవెల్లో 16,472, రూఫ్‌లెవెల్‌లో 3,769, 1378 టాప్ లెవెల్‌లో ఉన్నాయి. 10,936 గృహ నిర్మాణాలు పూర్తి ఆయ్యాయి. ఇంకా ప్రారంభం కాని 6,465. వీటిలో వైఎస్ఆర్ ఆర్బన్ ఇళ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాలకింద మంజూరైనవి ఉన్నాయి.

ప్ర: జూలై నెలలో సామూహిక గృహ ప్రవేశాల్లో జిల్లాలో ఎంత మంది చేరే అవకాశం ఉంది?

జ : రాష్ట్రవ్యాప్తంగా జూలై నెలలో ఐదు లక్షల ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేయించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. సత్యసాయి జిల్లా వరకు అయితే 15వేల ఇళ్లు పూర్తి చేయాలన్నది లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి కృషి చేస్తున్నాం.

ప్ర : గహ నిర్మాణాలు ఎన్ని రకాలుగా కొనసాగుతున్నాయి?

జ : లబ్ధిదారులు ముందుకు వచ్చి ప్రభుత్వం ఇచ్చే సాయానికి తోడు చేతనైన కొంత మొత్తం భరించి మెరుగైన ఇల్లు నిర్మించుకోవడం అనుకునే వారు కొందరైతే, మరికొందరు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి నిర్మించాలనే వారు. ఈ రెండవ రకానికి చెందినవి హిందూపురం, రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గంలో సుమారు 6వేల గృహాలు ఉన్నాయి వాటిని ప్రభుత్వం నిబంధన ప్రకారం నిర్మిస్తాం.

ప్ర : ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఎంత మంజూరు చేస్తుంది?

జ : గ్రామీణ ప్రాంతాలైనా, అర్బన్ ప్రాంతాలైనా ఒక ఇంటికి రూ.1. 80 లక్షలను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. మరో రూ.35వేలు స్వయం సహాయక సంఘాల ద్వారా పావలా వడ్డీకి రుణం మంజూరు చేయబడుతుంది. దీని ప్రకారం మొత్తం రూ, 2 .15 లక్షలు మంజూరు అవుతుంది. ప్రభుత్వం కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది.

ప్ర : జిల్లాకు మంజూరైన మొత్తం గృహ నిర్మాణాలు ఎప్పటిలోగా పూర్తి అవుతాయి, లబ్ధిదారులకు మీరిచ్చే సూచనలేమిటి?

జ : జిల్లాకు మంజూరైన 62,253 ఇళ్లు 2024 నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం. ఆ లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు వచ్చి త్వరితగతిన ఇల్లు నిర్మించుకోవాలని, సొంతింటి కల నెరవేర్చుకోవాలని సూచిస్తున్నాం.

హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి

అమ్మో... పశువుల దొంగలు



ప్రజాశక్తి పెద్దవడుగూరు

జీవనోపాధి కోసం యిష్టపడి పనిచేయడం కంటే దొంగతనం చేసి సునాయాసంగా డబ్బు సంపాదించాలనే ఆలోచన కొందరి బద్దకస్తుల్లో ఉంది. ఇలాంటి కొందరి ఆలోచన సమాజానికి ఇబ్బందిగా మారింది. అదేదో సామెత చెప్పినట్లు దొంగతనానికి బానిసైన వాడు దేనిని వదలడం లేదు. ఇంట్లో చొరబడి రాత్రివేళ ఇంటికి కన్నం వేసి దొంగతనాలు చేసే రోజులు పోయాయి.ఇంట్లో ఒంటరిగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని కొందరు అవసరమైతే దాడి చేసి ఇంట్లో నగలు, నగదు ఎత్తుకెళుతున్నారు. ఇటీవలి కాలంలో మహిళలు ఒంటరిగా వెళు తుంటే ద్విచక్ర వాహనాల్లో వచ్చి మెడలో గొలుసు లాక్కుని వేగంగా వాహనంలో ఉడాయించే దొంగలూ ఉన్నారు. అయితే వీటికి భిన్నంగా కొందరు దుండగులు పెద్దవడుగూరు మండలంలో సరికొత్త దొంగతనానికి తెరలేపారు. అదును చూసి రైతుల పశువులను ఎత్తుకెళుతున్నారు. ఇటీవల కాలంలో మండలంలో పశువుల దొంగల బెడద అధికమైంది. పశువుల ధరలు, పశుగ్రాసం ధరలు చూసి పశుపోషణ భారంగా భావించిన రైతన్నలు చాలాకాలంగా పశువుల పెంపకం పట్ల ఆసక్తి చూపడం లేదు. అంతేగాక పాడి కోసం, పేడ కోసం ఆవులకు బదులు గేదెలు పెంచుకుంటున్నారు. వ్యవసాయానికి పనికి వచ్చే ఎద్దుల పెంపకం పూర్తిగా తగ్గిపోయింది. వాటికి బదులుగా ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పరికరాలు ఉపయోగించడంతో పశువుల పెంపకంపై పెద్దగా ఆసక్తి లేకుండా పోయింది. కాగా అడపా దడపా పెంచుకున్న పశు వులను పోషించుకుంటున్న యజమానులు తమ పశువులు కనిపించక పోవడంతో లబోదిబో మంటున్నారు.

ఆందోళనలో పాడిరైతులు

అన్నదాతలకు వ్యవసాయం ఎంతో ముఖ్యమో పాడి అభివృద్ధి అంతే ప్రధానం. అలాంటి పాడిపశువులను కొందరు దుండగులు మాయం చేస్తున్నారు. ఇక్కడి పాడిరైతులకు చెందిన పశువులను దొంగిలించి ఆర్థికంగా దెబ్బతిస్తున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో వ్యవసాయం గిట్టుబాటు కాక, పాడిని నమ్ముకుని జీవించే రైతులు అధికంగా ఉన్నారు. పెద్దవడుగూరులో పదిరోజుల నుంచి దాదాపు వంద పశువులు దొంగలించబడ్డాయి. మండలంలోని చిన్నవడుగూరు, లక్షుంపల్లి, చిన్నవడుగూరు, మేడిమాకులపల్లి, కొట్టాలపల్లి, మిడుతూరు, పెద్దవడుగూరు గ్రామాలకు చెందిన పలువురు రైతుల పశు వులను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రివేళల్లో ఎత్తుకెళ్లి మార్కెట్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం వేసవికాలం అయినందున రైతులు పశువులను బయటకు వదిలిపెడతారు. ఇదే అదునుగా భావించిన కొందరు దుండగులు వాటిని లారీ, డీజిల్ ట్రాలీ ఆటో ఇతర వాహనాల్లో ఎక్కించుకుని వాటిని దూరంగా తరలిస్తున్నారు. బహిరంగ మార్కెట్లలో అమ్ముకుని అటునుంచి అటే పరారవుతున్నారు. పెద్దవడుగూరుకు చెందిన రామ రవికుమారు, నాగార్జున, గంగన్న, సూర్యనారాయణరెడ్డి, రాజు, ఓబిరెడ్డి, రంగనాయకులు, తదితరులకు చెందిన పశు వులు పదిరోజులుగా కనిపించకుండా పోయాయి. ఎక్కడకు వెళ్లాయని ఆరాతీస్తున్నా ఎక్కడ ఉన్నది అంతుచిక్కడంలేదు. రోజు అడవికి వెళ్లిన పశువులు తిరిగి సాయంత్రానికి ఇంటికి వస్తాయి. తమ పశువులు ఇంటికి రాకపోవడంతో రైతులకు అనుమానం వచ్చి అన్ని చోట్ల గాలించినా ఫలితం లేకపోయింది. మండలంలోకి దొంగలు ప్రవేశించి పశువులను టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. పశువులను ఎత్తుకెళ్లి అమ్ముకుంటే ఒక్కో గేదె ద్వారా రూ.10వేల నుంచి రూ. 50వేల దాకా ఆదాయం వస్తుందనే ఆశలతో దొంగలించుకు వెళ్తున్నారు. ఈ విషయంపై పోలీసులు స్పందించి మూగజీవాల దొంగలను పట్టుకుని రైతులకు న్యాయం చేయాల్సుంది.

పెనుకొండ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

దర్గాలో ఎమ్మెల్సీ ఇక్బాల్ ప్రార్థనలు

హిందూపురం : నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ఆదివారం పెనుకొండ దర్గాలో వెలసిన బాబయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా అవరణలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు నిర్వహించామన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు ఉన్నారు.

సజావుగా పరీక్షలు

హిందూపురం : ఏపీ మోడల్ స్కూల్ పరీక్షలు ఆదివారం రూరల్ మండల పరిధిలోని రాచపల్లి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్లో సజావుగా జరిగాయి. ఈ పరీక్షలకు ఎంఈఓ గంగప్ప డిపార్ట్‌మెంట్ అధికారిగా, ప్రిన్సిపల్ అశోక్‌నాయక్ చీఫ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరించారు. వారు మాట్లాడుతూ వివిధ తరగతుల ప్రవేశం కోసం 98 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 79 మంది హాజరయ్యారన్నారు. ఫలితాలను ఈ నెల 18వ తేదీ ప్రకటిస్తామన్నారు.

ఆసక్తికరంగా ఎన్టీఆర్ క్రికెట్ టోర్నీ

కదిరి టౌన్ : విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌టిఎస్ఎన్ డిగ్రీ కాలేజీ మైదానం లో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. మూడో రోజైన ఆదివారం ఫౌండేషన్ అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు తన సహకా రం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఆదివారం జరిగిన పోటీల్లో బాలయ్య లెవెన్స్‌పై సూపర్ సిక్సర్స్ జట్టు, కెకెపి కాలనీ టీమ్‌పై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ పట్నంపై అంబేద్కర్ జట్టు విజయం సాధించాయి. కార్యక్రమంలో యువకులు, క్రీడాకారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడాలి

కొత్తచెరువు : చెట్ల విలువను ప్రజలు, అధికారులు గుర్తించలేకపోతున్నారని ప్రముఖ పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తచెరువులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెట్లను రక్షించడానికి ప్రభుత్వం ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. ప్రాణదానం, అన్నదానం, జీవన దానం చేస్తున్న చెట్లను కాపాడడాని కి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చెట్లను కాపాడకపోతే భవిష్యత్తులో జీవరాశికి తీరని నష్టం కలుగుతుంద న్నారు. విద్యార్థి దశ నుంచే చెట్ల విశిష్టతను, వాటి పరిరక్షణ పద్ధతిని నేర్పించాలన్నారు. అధికారులు వాల్టా చట్టాన్ని, ఫారెస్ట్ చట్టాన్ని గౌరవించి చెట్లు నరికే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అడవుల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములు చేయాలని, అలా చేస్తేనే చెట్లను కాపాడుకోగలమన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

పుట్టపర్తి అర్బన్ : అన్ని రంగాల్లో వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సాయి ఆరామంలో ఆదివారం రాష్ట్ర, జిల్లా రజక సంఘం నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు బాపనపల్లి శివప్ప, రాష్ట్ర కార్యదర్శి తేలిక ఆంజనేయులు మాట్లాడుతూ నూతనంగా సత్యసాయి జిల్లా ఏర్పడినందున జిల్లా కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి రజక కుటుంబానికి మూడెకరాల భూమి, రూ. లక్ష పథకం అమలు చేయాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు పింఛన్ ఇవ్వాలని, ప్రతి జిల్లాలో కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీటిని సాధించడానికి రజకులు పోరాటానికి సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాల కార్యదర్శి అంబులెన్స్ రమేష్, జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, సాధికారిక రాష్ట్ర డైరెక్టర్ రామచంద్ర, జిల్లా సాధికారిక కమిటీ కన్వీనర్ మాల్యవంతం నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

హిందూపురం : విద్యార్థులు చదువుతో పాటు కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు మానసిక ఒత్తిడిని అధిగమించడానికి సాధ్యమవుతుందని దీప్తి పాఠశాల డైరెక్టర్ దీపూ పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో దీప్తి పాఠశాలలో విద్యార్థులకు కరాటే మాస్టర్ ఫైరోజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆదివారం వారికి ఆల్ ఇండియా చీఫ్ కోచ్ ఎం.అల్తాఫ్ సమక్షంలో పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన 55 మందికి వివిధ బెల్టులను ప్రదానం చేశారు.

గుండె వైద్యశిబిరానికి అనూహ్యస్పందన

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మస్జిద్–ఏ కుబ్రా మసీదు నవజవాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా గుండె ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి యాజమాన్యం సహకారంతో వైద్యులు నాగరాజు, షెక్షా, రేణా105 మందికి ఉచితంగా ఈసీజీ, ఈసీఓ, షుగర్, బీపీ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం గుండె సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్లు వివరించారు. కార్యక్రమంలో ఉషోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, ముస్లిం మైనార్టీలు హిదయతుల్లా, ఇనయ్‌తుల్లా, అబ్దుల్, నబి అమీర్, షాహిద్, జాకీర్, హుసేన్, సలీం పాల్గొన్నారు.

గుండె చికిత్సలు నిర్వహిస్తున్న సవేరా ఆసుపత్రి వైద్యులు

విద్యకు పేదరికం అడ్డు కాదు : 'పల్లె'

పుట్టపర్తి అర్బన్ : విద్యల్లో రాణించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. పదో తరగతిలో ప్రతిభ కనబరచిన బెస్త విద్యార్థులకు ఆదివారం జిల్లా బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతి చంద్ర శేఖర్ అధ్యక్షతన ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా పల్లెతో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త పులివెందుల గువ్వల గంగాధర్, రంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డు కాదన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రతిభ ఉంటుందని, దాన్ని నిరూపించుకోవా లన్నారు. జిల్లా అధ్యక్షుడు కెవి రమణ మాట్లాడుతూ బెస్తలు రాజకీయంగా ఎదగాల న్నారు. అనంతరం గువ్వల గంగాధర్ విద్యార్థులు పూజిత, సాయికి రూ. 10 వేలు చొప్పున, గీతాంజలికి రూ. 7 వేలు, మహేందర్‌కు రూ. 5వేలు, మరో 27 మందికి రూ. 4 వేలు చొప్పున నగదు అందజేశారు. అలాగే మెమెంటో, మెడల్, సర్టిఫికెట్, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షు లు బయన్న, లక్ష్మీనారాయణ, రామ్మోహన్, సలహాదారులు బెస్త చలపతి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, జయసాయి పాల్గొన్నారు.

పురస్కారాలు అందజేస్తున్న పల్లె, బెస్త సంఘం నాయకులు

కళలను ఆదరించాలి : నిర్మల

ధర్మవరం టౌన్ : భారత దేశ కళలను ఆదరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ లింగం నిర్మల, వైస్ ఛైర్మన్ పెనుజూరు నాగరాజు పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో శ్రీలలిత నాట్య కళానికేతన్ నాట్యాచార్యులు బాబు బాలాజీ, కమలా బాలాజీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాట్య శిక్షణ శిబిరంలో విద్యార్థులకు కూచిపూడి, భరతనాట్యం, జానపద కళల్లో శిక్షణ ఇచ్చారు. ఈ క్రమంలో ఆదివారం పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శిక్షణ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 59 మంది విద్యార్థినులు చేసిన నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం నాట్యం చేసిన వారికి ముఖ్య అతిథులు మెమెంటోలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ తీర్థాల స్వర్ణలత, మాజీ కౌన్సిలర్ ఉడుముల రామచంద్ర, వార్డు ఇన్‌ఛార్జి నాయకులు తీర్థాల రమణ, రామలాలిత్య, విద్యార్థుల తల్లిదండ్రులు, నృత్య కళాభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మెమొంటో అందజేస్తున్న నిర్మల, నాగరాజు

సంక్షోభంలో విద్యుత్ రంగం : మాజీ ఎమ్మెల్యే ఈరన్న

ప్రజాశక్తి-మడకశిర

వైసిపి హయాంలో విద్యుత్ రంగం పూర్తిగా సంక్షోభంలో చిక్కుకుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరన్న విమర్శించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆదివా రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజలను పరిపాలన తోనే కాదు కరెంటుతో కూడా షాక్ కొట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. 2014–2019 కాలంలో చంద్రబాబు మిగులు విద్యుత్‌తో ఏపీని దేశంలోనే నంబర్–1గా నిలిపితే, ఈ సైకో వచ్చిన తర్వాత పవర్ హాలిడే ప్రకటించే దుస్థితికి పడిపోయిందని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసి మోసం చేశాడన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకొంటున్న జగన్ రైతుల నుంచి నెలకు రూ. 30 లు అదనపు ఛార్జీలు వసూలు చేయడం అత్యంత హేయం అన్నారు. డిస్కంలో సగటు విద్యుత్ యూనిట్ ధర రూ. 4.77 ఉంటే వైసిపి ప్రభుత్వం రూ. 8.70కు కొనుగోలు చేసి ఏటా ప్రజలపై రూ. 6 వేల కోట్ల భారం మోపిందన్నారు. ట్రూ అప్ ఛార్జీలు, టారీఫ్‌ల పేర ప్రజల నడ్డి విరుస్తున్న ఈ ప్రభుత్వం త్వరలో కూలిపోవడం ఖాయయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ సంఘం కన్వీనర్ పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషన్, ఆదినారాయణ, ప్రకాష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈరన్న

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

హిందూపురం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నాయకత్వ లక్షణాలను అలవాటు చేసుకోవాలని విశ్రాంత ఆర్మీ కెప్టెన్, ఎల్ఆర్‌జి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామిరెడ్డి సూచించారు. రూరల్ మండల పరిధిలోని కిరికెర వద్ద వద్ద ఉన్న ఎల్ఆర్‌జి పబ్లిక్ స్కూల్లో ఆదివారం విద్యార్థుల నాయకత్వ ప్రమాణ మహోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రామిరెడ్డి ఎంపిక చేసిన విద్యార్థి నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థి దశ నుంచే బాధ్యతాయుతంగా మెలుగుతారన్నారు. హెచ్‌ఎం భారతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులతో విశ్రాంత ఆర్మీ కెప్టెన్ రామిరెడ్డి

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య

ఆర్‌డిటి ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్ మురళి

ప్రజాశక్తి-బత్తలపల్లి

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలన్న ఆశయంతో ఆర్‌డిటి వేలాది మందికి కార్పొరేట్ కళాశాల్లో ఉన్నత చదువులు చదివేందుకు తోడ్పాటునందిస్తోందని ఎడ్యుకేషనల్ డైరెక్టర్ మోహన్ మురళి పేర్కొన్నారు. ఆర్‌డిటి సెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆదివారం ఆర్‌డిటి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మోహన్‌మురళి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ రెండేళ్లు, బి.టెక్ నాలుగేళ్లు ఆయా కళాశాల్లో విద్యకయ్యే ఖర్చును ఆర్‌డిటి భరిస్తుందన్నారు. అనంతపురం, కర్నూలు, విజయవాడ, తిరుపతి పట్టణాల్లో ఎంపిక చేసుకున్న కళాశాలలో విద్యనభ్యసించవచ్చు అన్నా రు. పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలనే ఆశయంతో ఆర్‌డిటి స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం–2004లో ప్రారంభమైందన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా వేలాది పేద కుటుంబాలు ఉన్నతిని సాధించాయన్నారు. ఈ సంవత్సరం బత్తలపల్లి రీజియన్‌లో 461 మంది ఆర్‌డిటి సెట్ రాయగా 68 మంది ఎంపికైనట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి అత్యుత్తమ మార్కులు సాధిం చి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బత్తలపల్లి రీజినల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్‌లు రుక్మాంగధ, రఘురాం, సంజీవరెడ్డి, శ్రీనివాసులు, ఎస్‌టిఎల్స్ రామకృష్ణ, సురేంద్ర, రామాంజనేయులు, రాజేంద్ర, సిఓలు వెంకటేష్, సురేష్, చిత్రసేన, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మోహన్‌మురళి

హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా సీఎం జగన్ పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే సిద్ధారెడ్డి పేర్కొన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించిన సందర్భంగా పారామెడికల్ ఉద్యోగులు ఆదివారం పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు వద్ద ఎమ్మెల్యే సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో చేసిన వాగ్దానం మేరకు 2014 నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ జీవో విడుదల చేశారన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన మాటకు కట్టుబడి 98.55%కి పైగా వాగ్దానాలను అమలుచేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఒకవైపు సంక్షేమం మరో వైపు అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళు తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉద్యో గులు థాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, పారా మెడికల్ ఉద్యోగులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు వైద్య సేవలందించడమే రోటరీక్లబ్ లక్ష్యం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పేద ప్రజలకు వైద్య సేవలందించడమే రోటరీ క్లబ్ లక్ష్యమని అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, రామకృష్ణ, కోశాధికారి జయసింహ పేర్కొన్నారు. పట్టణంలోని కోట మున్సిపల్ పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ ధర్మవరం, శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధ త్వ నివారణ సంస్థ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్రదానం చేసి, మరో రెండు జీవితాల్లో వెలుగు నింపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎవరైనా మృతి చెందినప్పుడు గంటలోపు రోటరీ క్లబ్‌కు సమాచారం ఇస్తే ఆ కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలను కూడా దానం చేయవచ్చునని తెలిపా రు. కంటి వైద్య శిబిరంలో 260 మంది పరీక్షలు చేయించుకోగా 186 మందిని ఆపరేషన్ ఎంపిక చేశారు. వీరిని బస్సులో బెంగళూరు తీసుకెళ్లి ఆపరేషన్ చేసి రెండు రోజుల్లో పంపిస్తామని తెలిపారు. సోలిగాళ్ల పెద్ద వెంకటేశులు జ్ఞాపకార్థం ఆయన భార్య రామాంజన మ్మ, కూతురు రూపాదేవి, అల్లుడు నారాయణ, కుమారుడు కొండప్ప, కోడలు వరలక్ష్మి శిబిరం ఏర్పాటుకు ఆర్థిక సాయం చేశారు. అనంతరం శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ మాల్విక, పిఆర్ఓ శివప్రకాష్‌తో పాటు, దాతలను సత్కరించారు. కార్యక్రమంలో క్యాంపు ఛైర్మన్ సోలిగాళ్ల వెంకటేశులు, ఆర్గనైజర్స్ నరేంద్రరెడ్డి, శివయ్య, బండారు చలం, కొండయ్య, మనోహర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో దాతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

వడ్డెర్లు ఐకమత్యంగా ముందుకు సాగాలి

ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మల్లెల జయరామ్

ఓబుళదేవరచెరువు: వడ్డెర్లు ఐకమత్యం గా ముందుకు సాగాలని, ఎప్పుడు ఏ కష్టం వచ్చినా సంఘం తరపున ఆదుకోవడానికి ఎప్పుడూ ముం దుంటానని వడ్డెర సంఘం ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు మల్లెల జయరామ్ భరోసా ఇచ్చా రు. స్థానిక వడ్డెర్ల సంఘం కార్యాలయంలో ఆదివా రం జయరామ్ నాయకత్వంలో వడ్డెర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే సీటును బిసిలకు కేటాయిస్తే వడ్డెర కుల నాయకుడు మల్లెల జయరామ్‌కు కేటాయించాలని కోరారు. బిసిలకు ఎమ్మెల్యే టికెట్ ఇవాలని 2001 నుంచి ప్రతిపాదనలో ఉన్నందున 2024 ఎన్నికల్లో వడ్డెర్లకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జయరామ్‌కు ఏ పార్టీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినా ఆ పార్టీ కోసం పని చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల గోవిందరాజులు, జిల్లా యూత్ అధ్యక్షుడు వడ్డే నాగార్జున, నాయకులు సుధాకర్, రామచంద్రప్ప, రమణ, కిష్టప్ప, ఓబుళదేవరచెరువు, అమడగూరు మండలాకు చెందిన వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ధర్మవరం టౌన్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షు డు శెట్టిపి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరంలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో పిల్లలు సెల్‌ఫోన్, వీడియో గేమ్స్‌తో సమయం వధా చేయకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గ్రంథాలయం వెళ్లి పుస్తకాలు చదవాలని ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి, ఎల్ఐసి ఏజెంట్ నాగరాజు, నారాయణస్వామి, మురళి, ముకుంద, సిబ్బంది సత్యనారాయణ, శివమ్మ, నాయక్, గంగాధర్ పాల్గొన్నారు.

హిందూపురం: జిల్లా గ్రంథలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి లైబ్రేరియన్ శ్రీధర్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఉమర్ ఫరూక్, ట్రాఫిక్ ఎస్ఐ కళావతి, కవి, రచయిత, ఆంధ్రరత్న గంగాధర్, కల్లూరు రాఘవేంద్రరావు హాజరయ్యారు. వారు వేసవి శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. అనంతరం వారు చదువు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు శొంటి జయప్రకాశ్, ఉపాధ్యాయులు శ్రీశైలం, ఆఫ్జల్ బాషా, నాజిమ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల గ్రంథాలయంలో మాట్లాడుతున్న అధికారులు

బత్తలపల్లి: చిన్నతనం నుంచే పుస్తక పఠనం అలవర్చుకుంటే విద్యలో బాగా రాణించవ చ్చని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబి రం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాధరి స్కూల్ ప్రిన్సిపల్ జే.లక్ష్మి, టీచర్లు మంజుల, మాధవి, గ్రంథాలయ అధికారిణి రాజేశ్వరి మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన అక్షిత, బిందుప్రియ, పండు, తన్వి, చిన్నీ, భరత్‌లకు బహుమతులు ప్రదానం చేశారు.

మడకశిర రూరల్ : పట్టణంలోని గ్రంథాలయం వద్ద గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు ఎంఇఒ భాస్కర్ బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని భావిభారత పౌరులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

గోరంట్ల రూరల్: విద్యార్థులు, ప్రజలు విజ్ఞానం పెంపొందించుకోవడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగక రమని వక్తలు పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిథులుగా గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు, రిటైర్డ్ హెచ్‌ఎం మహమ్మద్‌అలీ, రిటైర్డ్ ఎంఈఓ జయచంద్రారెడ్డి, ఓంప్రకాష్, చలపతి, బాషా, శ్రీనివాసగుప్తా హాజరై మాట్లాడారు. వివిధ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, రైటింగ్ ప్యాడ్లు ప్రదానం చేసినట్లు గ్రంథాలయ అధికారి చిన్న రమేష్‌నాయక్ తెలిపారు.

గాండ్లపెంట: స్థానిక గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగిసిందని గ్రంథాలయ అధికారిణి పర్వీన్‌బాను తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ బి.కృష్ణనాయక్ హాజరై శిక్షణ తరగతుల్లో డ్రాయింగ్, వ్యాసరచన, తదితర పోటీల విజేతలకు క్లిప్ అట్టలు, పెన్నులు, తదితర బహుమతులను అందజేశారు.

పెనుకొండ గ్రంథాలయంలో మాట్లాడుతున్న అధికారులు

రొళ్ల : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎపిజిబి మేనేజర్ నాగరాజు, మురళి స్కూల్ హెచ్‌ఎం నరసింహమూర్తి, లెక్చరర్ రామంజినాయక్ హాజరై మాట్లాడాచు. విద్యార్థులు చిన్నతనం నుంచే గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు.

రొద్దం : స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వశించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ నాగస్వామి, హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు విద్య ఆవశ్యకత, క్రమశిక్షణ గురించి వివరించారు. అనంతరం గ్రంథాలయ అధికారి నాగరాజును శాలువా కప్పి సన్మానించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జమేదార్ కాంతప్ప, విశ్రాంత ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు మారుతి, తేజ పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరం ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా అమర్‌సింగ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ అధికారి వేణుగోపాల్, లైబ్రేరియన్ మహబూబ్ బాషా, రిసోర్స్ పర్సన్ దాదు పాల్గొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

చిలమత్తూరు: స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రంథాలయశాఖ అధికారి మల్లికార్జున విద్యార్థుల కు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

నేరాలు ఘోరాలు

బైకును ఢీకొన్న టిప్పర్.. వ్యక్తి మృతి

బత్తలపల్లి: మండల పరిధిలోని పోట్లమర్రి గ్రామం సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోట్లమర్రి గ్రామానికి చెందిన తరిగి రామకృష్ణ(47)ఉదయం ద్విచక్ర వాహనంపై పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా పోట్లమర్రి–చింతలపల్లి రహదారిలో వృద్ధాశ్రమం సమీపంలో ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం పను లు చేసుకుంటున్న రైతులు గమనించి సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు పెద్దఎత్తున సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకు ని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని, కేసు నమోదు చేసుకున్నారు. అలాగే మృతదేహాన్ని ధర్మవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, వైసిపి మండల కన్వీనర్ ఇద్దిరి బయపరెడ్డి, విద్యార్థి విభాగం నాయ కులు నరేంద్రరెడ్డి, నాయకులు హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, సుధాకరరెడ్డి, కార్యకర్తలు ఆసుపత్రి వెళ్లి రామకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామ ర్శించారు. రామకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత..

కొత్తచెరువు : స్థానిక ధర్మవరం రహదారిలోని దాల్ మిల్లు వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తచెరువుకు చెందిన మజ్జిగ సురేంద్ర, భార్య రమణమ్మ(33), కూతురు సాయిప్రియ ద్విచక్ర వాహనంపై ధర్మవరం నుంచి కొత్తచెరువుకు వస్తుండగా కర్నాటకలోని నాగేపల్లికి చెందిన అనిల్‌కుమార్ కారులో వేగంగా వచ్చి ఢీకొన్నారు. దీంతో తీవ్రంగా గాయపడిన రమణమ్మ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. సురేంద్ర, సాయిప్రియకు స్వల్ప గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పెనుగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

రొద్దం : విద్యుత్ స్తంభం పైనుంచి పడి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి కొట్టాల వద్ద చోటుచేసుకుంది. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేసే కొందరు లైన్‌మేన్లు వారి కింద ప్రయివేట్ వ్యక్తులను నియమించుకుని విద్యుత్ మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ కోవలోనే ఓ లైన్‌మేన్ ఐదేళ్లుగా రామచంద్రయ్యతో విద్యుత్ మరమ్మతులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో రామచంద్రయ్య విద్యుత్ మరమ్మతులు చేస్తూ స్తంభంపై నుంచి పడిపోవడంతో కాళ్లు, చేతులకు గాయాలు అయినాయి. దీంతో అతడిని ఆర్.మరువపల్లిలో ఉన్న ప్రయివేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి హిందూపురం ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈని వివరణ కోరగా ఈదురు గాలులు రావడంతో విద్యుత్ సరఫరా లేదని, కావున అతడు విద్యుదాఘాతానికి గురవ్వలేదని తెలిపారు.

మామిడి చెట్లు అగ్నికి ఆహుతి

బుక్కపట్నం: మండల పరిధిలోని గునిపల్లి గ్రామానికి చెందిన రైతు నాగభూషణరెడ్డి తోటలోని మామిడి చెట్లు శనివారం సాయంత్రం అగ్నికి ఆహుత య్యాయి. కౌలు రైతు జూటూరు ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తోటకు రెండు వైపులా మంటలు వ్యాపించడంతో వెంటనే అక్కడికి చేరుకొని అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు. అప్పటికే 8 ఏళ్ల నాటి వంద మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయని వాపోయాడు. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న మామిడి చెట్లతో పాటు డ్రిప్పు పైపులు కాలిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

విద్యా బోధనలో 'శ్రీ రితు కాన్సెప్ట్' స్కూల్ నూతన ఒరవడి

పుట్టపర్తి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు తక్కువ ఫీజులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించడమే శ్రీరితు కాన్సెప్ట్ స్కూల్ ప్రథమ ఉద్దేశ్యమని కరస్పాండెంట్ రోషిణిరెడ్డి, ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. పెడబల్లి శ్రీరితు పాఠశాలలో ఆదివారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ పెడబల్లి–గోరంట్ల ప్రధాన రహదారి లో నూతన భవనంలో అన్ని సౌకర్యాలతో స్కూల్ ఏర్పాటు చేశామన్నారు. విద్యారంగంలో విశేష అనుభవం కలిగిన అధ్యాపకులను నియమించామన్నారు. చుట్టుపక్కల గ్రామాల విద్యా ర్థుల సౌకర్యార్థం బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఇంగ్లీష్ భాషను సులభమైన రీతిలో బోధిం చడం, విద్యార్థులకు భాష పట్ల ప్రేమాభిమానాలు కల్పించి ఉత్తమ రీతిలో విద్యనందిస్తామని తెలిపారు. ప్రత్యేక శిక్షకుడు పర్యవేక్షణలో వారంలో రెండు డ్యాన్స్ క్లాసులు(క్లాసికల్, ఫోక్) నిర్వ హిస్తామని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభీష్టం మేరకు వాటిని నేర్పుతామన్నారు. క్రీడల్లో నూ ప్రోత్సహిస్తామన్నారు. నర్సరీ నుంచి 7వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, సీట్లు పరిమితంగా ఉన్నాయన్నారు. అడ్మిషన్ ఫీజు లేదని ఫీజులు అతి తక్కువగా నిర్ణయించా మన్నారు. వివరాలకు 93918 86449, 79898 74391 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి

ఆర్థికసాయం అందజేస్తున్న తోటి మిత్రులు

మిత్రుని కుటుంబానికి రూ. లక్ష సాయం

కొత్తచెరువు: కొత్తచెరువుకు చెందిన సాయిప్రవీణ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందా డు. ఈ విషయం తెలుసుకున్న 1993–94లో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సాయిప్రవీణ్‌తో పాటు 10వ తరగతి చదివిన స్నేహితులు ఆదివారం ప్రవీన్ కుటుంబ సభ్యులను పరామర్శిం చి రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో భాస్కర్‌నాయుడు, ఎయిర్‌టెల్ వేణు గోపాల్, చంద్రమోహన్, భాస్కర్, రామాంజనేయులు, కవిత, అనిత, వరలక్ష్మి, కాంచన, తదిత రులు పాల్గొన్నారు.

విజయపథంలో 'మంగళకర' విద్యార్థులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

డిగ్రీ, ఇంటర్, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంగళకర విద్యార్థులు ముందంజలో ఉన్నారని ఛైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్, ఆర్యప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మంగళకర విద్యాసంస్థలో ఆదివారం వారు ప్రజాశక్తితో మాట్లాడుతూ పుట్టపర్తి మండల పరిధి లోని జగరాజుపల్లి వద్ద ఆహ్లాదకరమైన వాతావరణంలో మంగళకర విద్యాసంస్థలు ఏర్పాటు చేశామన్నారు. విశేష అనుభవం, అంకితభావం కలిగిన యాజమాన్యం సారథ్యంలో అనుభవ జ్ఞులైన అధ్యాపకులు, ఉన్నత ప్రమాణాలతో విద్యనందిస్తున్నామన్నారు. 3వ తరగతి నుంచి కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లీష్‌కు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తామన్నారు. మారిన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థుల ఆసక్తి, అభిరుచిని బట్టి ఐఐటి, జేఈఈ, నీట్, ఒలింపి యాడ్, ఫౌండేషన్ క్లాసుల నిర్వహణ, అధునాతనమైన కంప్యూటర్ సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, వంటి సదుపాయాలు, అందుబాటు లో ఉన్నాయన్నారు. సువిశాలమైన ఆట స్థలం ఉందని, శారీరక, మానసిక ఉల్లాసం కోసం క్రీడల్లో ప్రోత్సహిస్తామన్నారు. బస్సు సౌకర్యం ఉందన్నారు. 2022–23లో పదో తరగతిలో వంద శాతం, ఇంటర్ ఫలితాల్లో 85%, డిగ్రీలో ఉత్తమ ఫలితాలు సాధించామని తెలిపారు.


సురేష్ కుమార్

ఆర్యప్రకాష్